## ఉద్యోగాలొచ్చే దాకా ఉద్యమిస్తాం

- టీజీపీఎస్సీ ముట్టడికి తరలివచ్చిన నిరుద్యోగులు
- రోడ్డుపై బైఠాయింపు.. పోలీసుల అరెస్టు

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): ఉద్యోగాలు వచ్చేదాకా ఉద్యమిస్తాం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతాం.. అని నిరుద్యోగ యువత ప్రతినబూనింది. గ్రూప్1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి పాటించాలని, గ్రూప్2, 3లో ఉద్యోగాల సంఖ్య పెంచాలని, మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు హైదరాబాద్ నాంపల్లిలోని టీజీపీఎస్సీ ఆఫీస్ ముట్టడికి మంగళవారం పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఏబీవీపీ మదతిచ్చింది. ఉదయం నిరుద్యోగులు టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి తరలిరాగా, అప్పటికే పోలీసులు మోహరించి గేట్ల ముందు బారికేడ్లు అడ్డు పెట్టారు. నిరుద్యోగులు అక్కడే బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని మండిపడ్డారు. ధర్నా చేస్తున్న నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## నియంతలా మారిన రేవంత్‌రెడ్డి

**శాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్**

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి నియంతలా మారి నిరుద్యోగులపై నిర్బంధం మోపుతున్నారని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ హామీల అమలు కోసం మోతీలాల్‌నాయక్ ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తుంటే సర్కారుకు చీమకుట్టినట్టుకూడా లేదని పేర్కొన్నారు. ఏడాదిలోపే హిట్లర్‌కు తాతలా ప్రవర్తిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నవతరం ముక్కు నేలకు రాయించడం ఖాయమని హెచ్చరించారు. నిరుద్యోగుల డిమాండ్లపై తక్షణమే సీఎం స్పందించి నిర్దిష్టమైన చర్యలు చేపట్టకపోతే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధి కోసం ఉద్యమిస్తున్న లక్షలాది నిరుద్యోగులను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టూ తిరుగుతున్న సీఎంకు నిరుద్యోగులను కలిసే తీరిక లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. త్వరలో జాబ్ క్యాలెండర్ పేరిట వార్తల లీకులతో ప్రభుత్వం యువతను మభ్యపెట్టే ఎత్తులు వేస్తున్నదని ఆరోపించారు. టీజీపీఎస్సీ ముట్టడికి అన్ని వర్గాలు సంపూర్ణ మద్దతు పలకాలని ఆంజనేయగౌడ్ కోరారు.

## సర్కారును గద్దె దించే దాకా పోరాటం

- నిరుద్యోగ యువత ప్రతిన
- జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి
- గ్రూప్స్ పోస్టుల సంఖ్య పెంచాలి
- లేకుంటే ఉద్యమాలు ఉధృతం

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారును గద్దె దించేదాకా పోరాబాట వీడమని నిరుద్యోగ యువత ప్రతినబూనింది. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుండటంపై భగ్గుమంది. నాటి హామీలు నీటి మూటలయ్యాయని, నిరుద్యోగులను ప్రభుత్వం నిలువునా ముంచిందని ధ్వజమెత్తారు. పక్షం రోజులుగా ఉద్యమిస్తున్నా నిమ్మకు నీరెత్తినటు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే మరింత ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది

అధికారంలోకి వస్తే నిరుద్యోగుల సమస్యలన్నీ తీరుస్తామని గత ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక మోసం చేసింది. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నిరుద్యోగులం కడదాకా ఉద్యమిస్తాం. మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఎంతవరకైనా పోరాడుతాం. బీఆర్ఎస్ పార్టీని కాదని అధికారంలోకి తెచ్చిన నిరుద్యోగులకు కాంగ్రెస్ గట్టిగా బుద్ధి చెప్పింది. ఇక రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించేంతవరకు పోరుబాట వీడం. - *అనిల్*

### గ్రూప్-2, 3 పోస్టులసంఖ్య పెంచాలి

ఎంతోకాలంగా ఎదురుచూసిన గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్‌లో అదనపు పోస్టులు కలపాలి. అప్పుడే నిరుద్యోగులకు న్యాయం జరుగుతుంది. ఇప్పటికే ఎంతోమందికి వయసు దాటిపోతుంది. మరో నోటిఫికేషన్ కోసం ఎదురుచూడాలని కాంగ్రెస్ నేతలు చెప్పడం దుర్మార్గం. ఇప్పట్లో కొత్త నోటిఫికేషన్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రకటించే అవకాశాలు తక్కువ. అందుకే ఈ నోటిఫికేషన్‌లోనే పోస్టుల సంఖ్య పెంచాలి. - *అర్జున్*

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బీఆర్ఎస్ నేతలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె రవి

# ఏడు మండలాల సంగతి ముందు తేల్చండి

మొదటిపేజీ తరువాయి...

నెలల కాలంలో పట్టణాలు, పంచాయతీలకు పైసా కూడా ఇవ్వకపోవడంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయిందని, దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టణ ప్రగతి, పల్లెప్రగతి ద్వారా ప్రతినెలా స్థానిక సంస్థలకు టంచన్‌గా నిధులు విడుదల చేశామని గుర్తుచేశారు. తెలంగాణ పల్లెలను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దామని, పల్లెలు అద్దాల్లా మారాయని, జాతీయస్థాయిలో అవార్డులు ప్రకటిస్తే తెలంగాణ కూడా ఉండేదని గుర్తుచేశారు.

### పంచాయతీ కార్యదర్శుల సొంత డబ్బులతో ఫైన్ చెల్లింపు

ట్రాక్టర్లకు రోడ్ టాక్స్ కట్టలేదని, బీమా లేదని ట్రాక్టర్లు సీజ్ చేస్తున్నారంటూ సిద్దిపేట జిల్లా చిన్నకొడూరు మండలం అనంతసాగర్‌లో జరిగిన ఘటనను హరీశ్‌రావు వివరించారు. రూ.16వేల ఫైన్ వస్తే కార్యదర్శులు సొంత డబ్బులు కట్టి విడిపించుకున్నారని తెలిపారు. గ్రామ కార్యదర్శులు సొంత డబ్బులతో డీజిల్ పోయించుకుంటున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులు 7 నెలలు జీతాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఒకటో తేదీనే వేతనాలు ఇస్తామన్న కాంగ్రెస్ పారిశుధ్య కార్మికులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు విడుదల చేయాలని గవర్నర్‌ను కలిసి సర్పంచులు వినతిపత్రం ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. తాము పంచాయతీలకు ప్రతి నెలా రూ.275 కోట్లు, ఏటా రూ. 3,330 కోట్లు పల్లెల్లో అభివృద్ధి కోసం ఇచ్చామని, పట్టణాలకు ఏటా 1700 కోట్లు ఇచ్చేవాళ్లమని గుర్తుచేశారు. దేశంలోనే తొలిసారిగా స్థానిక సంస్థలకు ప్రత్యేకంగా అడిషనల్ కలెక్టర్ అని పోస్ట్ పెట్టి వాటి బలోపేతానికి కృషి చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచుల పదవీకాలం ఇప్పటికే ముగిసిందని, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ల పదవీకాలం కూడా ముగుస్తున్నదని, వీటికి కూడా ఎన్నికలు నిర్వహించలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు ముందు రాష్ట్రంలో 87 ట్రాక్టర్లు మాత్రమే ఉంటే, నేడు 12,769 పంచాయతీల్లో ట్రాక్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు.

### ప్రభాకర్ ఆత్మహత్య కలచివేసింది

కాంగ్రెస్ పార్టీకి ఓటువేసిన పాపానికి ఖమ్మం జిల్లా చింతకాని మండలం రైతు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకున్నారని, ఆ వీడియో చూస్తే కన్నీళ్లు వచ్చాయని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని దారుణ పరిస్థితులకు ఈ ఘటన అద్దం పడుతున్నదని చెప్పారు. ప్రభాకర్ మరణానికి ప్రభుత్వమే కారణమని ఆరోపించారు.ప్రభాకర్ ఆత్మహత్యపై ఉన్న తస్థాయి విచారణ జరపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. రైతులు ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, వారికేదైనా కష్టం వస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతు తన వాంగ్మూలంలో రేవంత్‌రెడ్డి పేరు చెప్పాడని పేర్కొన్నారు. బాధ్యులను అరెస్ట్ చేసి కేసులుపెట్టి ఆయన భూమి తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అక్కడ బకాయిలతో కలిపి రూ. 4 వేల పింఛన్ ఇస్తే, ఇక్కడ ఇవ్వాల్సినవి కూడా ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. మీడియా సమావేశంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ ఎస్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పల్లె రవి, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, రామ్మూర్తియాదవ్ పాల్గొన్నారు.

అశోక్‌ను చుట్టుముట్టి అరెస్టు చేస్తున్న పోలీసులు

# ఓయూలో మళ్లీ రగిలిన జ్వాల

- దీక్షకు ఉపక్రమించిన ఫ్యాకల్టీ అశోక్
- చుట్టుముట్టి అరెస్టు చేసిన పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 2: ఉస్మానియా యూనివర్సిటీలో మళ్లీ ఉద్యమ జ్వాల రగిలింది. నిరుద్యోగుల పక్షాన దీక్ష చేపట్టేందుకు వచ్చిన పోటీ పరీక్షల నిపుణుడు అశోక్‌ను పోలీసులు అరెస్టు చేయడంతో నిరుద్యోగులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. 9 రోజులుగా గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మోతీలాల్ తన దీక్షను విరమించడంతో, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి తానే దీక్ష చేస్తానని అశోక్ ప్రకటించారు. అనంతరం ఓయూకు వస్తాడనే సమాచారంతో ఆర్ట్స్ కళాశాల ఆవరణను పోలీసుల వలయంగా మార్చివేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రాంగణానికి చేరుకొన్న అశోక్ కారు దిగగానే పోలీసులు చుట్టుముట్టి దీక్షకు అనుమతి లేదంటూ అరెస్టు చేసి, చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన దీక్ష కొనసాగిస్తున్నట్టు సమాచారం. అయితే అశోక్ అరెస్టు ఘటనపై ఉస్మానియాలో ఉద్రిక్తత నెలకొన్నది. ఈ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున నినదించారు. పోలీసు నిర్బంధంతో ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని దుయ్యబట్టారు. నిరుద్యోగ వాదం ఎత్తుకొని, నిరుద్యోగులను మోసం చేసి, కాంగ్రెస్ తరపున ఎమ్మెల్సీ పదవులు అనుభవిస్తున్న బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న దీనికి నైతిక బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ప్రొఫెసర్ కోదండరాం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఓయూ వేదికగా వేలాది మందితో నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు.

### బక్క జడ్సన్ ఆమరణ దీక్ష

నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ విషయం తెలిసిన పోలీసులు ఆయనను హౌజ్ అరెస్టు చేశారు. దీంతో ఆయన తన ఇంటి నుంచే ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తున్నట్టు సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. నిరహార దీక్ష చేస్తున్న ఆయన ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి పాటించాలని, గ్రూప్-2, గ్రూప్-3లో పోస్టుల సంఖ్య పెంచాలని, డీఎస్సీ పరీక్షను వాయిదా వేసి, మెగా డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చేంత వరకు తన దీక్ష కొనసాగుతుందని జడ్సన్ స్పష్టం చేశారు.

## మోతీలాల్ పోరాటం యువతకు స్ఫూర్తి

**మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్**

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్ పోరాటం యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తెలిపారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగుల కోసం ఆమరణ దీక్ష చేసిన మోతీలాల్‌ను తాను సెంట్రల్ యూనివర్సిటీలో కలిసి వచ్చినట్టుగా ఆమె తెలిపారు. మోతీలాల్ దీక్ష వల్ల ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చిందని చెప్పారు. దీంతో ఎవరినీ కలవకుండా మోతీలాల్‌ను ఇబ్బంది పెట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలను ఇప్పుడిప్పుడే గిరిజన బిడ్డలు తెలుసుకుంటున్నారని వివరించారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలని, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని, లేకుంటే తిరుగుబాటుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# హలో నిరుద్యోగి.. చలో టీజీపీఎస్సీ

- 5న ముట్టడికి నిరుద్యోగుల పిలుపు
- భారీ జనసమీకరణకు సన్నాహాలు
- మోతీలాల్ దీక్షకు దిగిరాని సర్కారు
- మళ్లీ ఉద్యమ కార్యాచరణకు సిద్ధం
- బీసీ జనసభ సంపూర్ణ మద్దతు

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): 'హలో నిరుద్యోగి.. చలో టీజీపీఎస్సీ' పేరుతో ఈ నెల 5న నిరుద్యోగులు మహాధర్నాకు పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాకు భారీ సంఖ్యలో సమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఈ ధర్నా ను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. గ్రూప్స్ ఉద్యోగాలు, నిరుద్యోగుల డిమాండ్ల సాధన కోసం చేపట్టిన ఈ పోరాటానికి వివిధ పక్షాలు విశాల మద్దతు ప్రకటిస్తున్నాయి. ఓయూ విద్యార్థి మోతీలాల్‌నాయక్ వారంపాటు గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేశారని, ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించినప్పటికీ ప్రభుత్వంలో చలనం రాలేదని నిరుద్యోగ జేఏసీ నేత లు మండిపడ్డారు. కనీసం ప్రభుత్వ పెద్దలు మో తీలాల్‌తో మాట్లాడే ప్రయత్నం కూడా చేయలేదని ఆగ్రహించారు. నిరుద్యోగ యువతతో చర్చ లు జరిపి, ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### నిరుద్యోగుల పక్షాన పోరాడుతాం

ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు నిరుద్యోగుల పక్షాన బీసీ జనసభ పోరాటం చేస్తుందని బీసీ జనసభ అధ్యక్షుడు, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షుడు రాజారామ్ యాదవ్ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న నిరుద్యోగులు చేపట్టిన మహాధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములం అవుతామని ప్రకటించారు. నిరుద్యోగుల కోసం అన్నివర్గాల ప్రజలు, విద్యార్థి సంఘాలు భాగస్వామ్యం కావాలని రాజారామ్ యాదవ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం మెడలు వంచైనా, యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేసేంత వరకు విద్యార్థి, నిరుద్యోగుల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

రాజారామ్ యాదవ్

- జీతాలు లేక పారిశుద్ధ్య కార్మికుల భిక్షాటన

*ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో పారిశుద్ధ్య కార్మికులు భిక్షాటనతో నిరసన తెలిపారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని చాట్లపల్లి, పలుగుగడ్డ, మునిగడప, రాయవరం, ధర్మారం, అంతాయగూడెం గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి భిక్షాటన చేశారు. బీఆర్ఎస్ హయాంలో జీతాలు నెల నెలా వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమ జీతాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని అన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని భిక్షాటన చేసి నిరసన తెలిపినట్టు వారు పేర్కొన్నారు. - జగదేవ్‌పూర్*

- బస్సుల కోసం ధర్నా

*తమకు సరిపడా బస్సులు నడపాలని విద్యార్థులు, ప్రయాణికులు మంగళవారం నిర్మల్ జిల్లా మామడ మండలంలోని పోన్కల్ వద్ద ఆర్టీసీ బస్సు ఎదుట నిలబడి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం అరకొర బస్సులు నడపడం వల్ల తాము పాఠశాలలు, కాలేజీలకు సరైన సమయంలో చేరుకోలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సుల్లో కెపాసిటీకి మించి ప్రయాణికులను తరలిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు మండలంలోని పోన్కల్, పోతారం, అనంతపేట్, కమల్‌కోట్ గ్రామాలకు ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. - నిర్మల్ అర్బన్*

- మద్దుకూరులో పోడుదారుల నిరసన

*భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంద్రుగొండ అటవీశాఖ రేంజ్ కార్యాలయం ఎదుట పోడుదారులు మంగళవారం నిరసన తెలిపారు. మద్దుకూరుకు చెందిన 20 మంది పోడుదారులు సుమారు రెండేండ్ల క్రితం 20 ఎకరాల అటవీశాఖ భూమిని సాగు కోసం పోడు కొట్టారు. ప్లాంటేషన్ మొక్కలు వేస్తామని చెప్పి అటవీ అధికారులు వారి నుంచి భూములను గంజుకున్నారు. ఈ ఏడాది అదే భూమిలో పోడు పట్టాలు కలిగిన అదే గ్రామానికి చెందిన కొందరు సాగు చేసుకుంటున్నారు. దీంతో పోడుదారులు అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి వచ్చి అక్కడే ఉన్న బీట్ అధికారి భాస్కర్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. - చంద్రుగొండ*

# స్వచ్ఛందంగా దీక్ష విరమిస్తున్నా

- ఆరోగ్యం సహకరించడం లేదు
- అవయవాలు దెబ్బతినే ప్రమాదం
- ఎవరి ప్రలోభాలకు లొంగలేదు
- ప్రత్యక్ష ఉద్యమంలో పాల్గొంటా
- ఉద్యోగాల సాధనే లక్ష్యం: మోతీలాల్

ఆమరణ నిరాహార దీక్ష విరమిస్తున్న మోతీలాల్ నాయక్

బన్సీలాల్‌పేట్, జూలై 2: 'ఆమరణ దీక్షతో నా ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. తొమ్మిది రోజులపాటు ఎలాంటి ఆహారం తీసుకోక క్రియాటిన్ లెవల్స్ పెరిగి, కిడ్నీ, లివర్ దెబ్బతిన్నాయి. శరీరం పూర్తిగా సహకరించని కారణంగా స్వచ్ఛందంగా దీక్ష విరమిస్తున్నా. నా తల్లిపై ప్రమాణం చేసి చెప్తున్న. ఇందులో ఎవరి బలవంతం, ఒత్తిడి లేదు' అని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్ నాయక్ స్పష్టం చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత తొమ్మిది రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన మోతీలాల్ నాయక్ మంగళవారం గాంధీ దవాఖాన వద్ద మీడియా సమక్షంలో కొబ్బరినీళ్లు తాగి దీక్ష విరమణ ప్రకటించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను ఎవరి ప్రలోభాలకు లొంగలేదని, బయట కొందరు కావాలని తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన దీక్షకు బీఆర్ఎస్, బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని, నూరు శాతం నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే చేశానని, ఇందులో రాజకీయాలు లేవని ఆయన తేల్చి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలంతా మరోసారి కేసీఆర్ ప్రభుత్వానికే ఓటు వేసి అధికారం ఇవ్వాలని అనుకున్నది నిజమేనని, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క లాంటి నాయకులు నిరుద్యోగుల వద్దకు వచ్చి నమ్మబలికారని ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి రాగానే ఏటా రెండు లక్షల ఉద్యోగాలను ఇస్తామని బాండ్ పేపర్‌పై గ్యారంటీ రాసిచ్చారని తెలిపారు. వారి మాటలు నమ్మి తాము గ్రామాల బాట పట్టి ఇంటింటికీ వెళ్లి తమకు ఉద్యోగాలు రావాలంటే కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేయాలని ప్రచారం చేశామని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోనే తుంగలోకి తొక్కేసిందని, నిరుద్యోగులను మోసం చేయడమే కాకుండా, చులకనగా చూడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తలుచుకుంటే ఏం చేయగలమో తెలిసొచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డికి రుచి చూపిస్తామని, లక్షలాది మంది నిరుద్యోగుల శక్తిని ప్రదర్శిస్తామని స్పష్టం చేశారు.

### గాంధీ వద్ద అరెస్టులు దారుణం

తనను పరామర్శించేందుకు వచ్చిన నిరుద్యోగ, రాజకీయ నేతలను పోలీసులు అరెస్టు చేయడం దారుణమని మోతీలాల్ నాయక్ విమర్శించారు. సోమవారమే పోలీసులు తన సెల్‌ఫోన్ లాక్కున్నారని, తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి నిరుద్యోగులను తన వద్దకు రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. తొమ్మిది రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టినా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని, ఇక పాము కాటు ఎలా ఉంటుందో తెలిసేలా చేస్తామని హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ, అశోక్‌నగర్ లైబ్రరీ వద్ద తోటి నిరుద్యోగులను కలిసి, వారితో చర్చించి భవిష్యత్తు ప్రణాళికను ప్రకటిస్తానని వెల్లడించారు.

### నిరుద్యోగుల సమస్యలే ఎజెండా

తెలంగాణలోని 33 లక్షల మంది నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తోనే తాను దీక్ష చేశానని, వ్యక్తిగత ఎజెండా ఏమీ లేదని మోతీలాల్ తెలిపారు. గ్రూప్1లో మెయిన్స్‌కు 1:100 చొప్పున ఎంపిక చేయాలని, గ్రూప్2లో రెండు వేలు, గ్రూప్3లో మూడు వేల పోస్టులకు రీనోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీని వాయిదా వేయాలని, మెగా డీఎస్సీ ప్రకటించాలని, ఖచ్చితంగా 50 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని, క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీక్షా సమయంలో గాంధీ దవాఖానకు వచ్చి తనను కలిసి సంఘీభావం తెలిపిన మాజీ మంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, నాయకులు రాణీ రుద్రమ, కాసం వెంకటేశ్వర్లు, వివిధ పక్షాల ప్రతినిధులు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, బక్క జడ్సన్, సేవాలాల్ సేన అధ్యక్షుడు సంజీవ్‌నాయక్, బంజారా సేవా సంఘం అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్‌నాయక్, బీసీ జన సభ అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు, వివిధ నిరుద్యోగ, విద్యార్థి సంఘాల నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### సీతక్క, బల్మూరి చెప్పినా వినలేదు

దీక్ష విరమిస్తేనే, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాటలను తాను అంగీకరించలేదని మోతీలాల్ చెప్పారు. గత ఆదివారం రాత్రి తన వద్దకు వచ్చిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాటల్లో స్పష్టత లేదని, దీక్ష విరమిస్తే నిరుద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఆలోచిస్తుందని చెప్పారని, అందుకు తాను ఒప్పుకోనందున దొడ్డిదారిన వెళ్లిపోయారని తెలిపారు. ముందు దీక్ష విరమిస్తే నిరుద్యోగుల డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలిస్తారని సోమవారం మంత్రి సీతక్క తనతో ఫోన్‌లో చెప్పారని, తమ డిమాండ్లను అంగీకరించి జీవో విడుదల చేస్తేనే తాను దీక్ష విరమిస్తానని కరాఖండిగా చెప్పానని తెలిపారు.

# తీన్మార్ మల్లన్నకు నిరసన సెగ

భువనగిరి కలెక్టరేట్, జూలై 2 : పట్టభద్రుల ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్ (తీన్మార్ మల్లన్న)కు భువనగిరిలో నిరసన సెగ తాకింది. మంగళవారం భువనగిరి జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్సీ మల్లన్న రాగా, బీజేపీ, బీజేవైఎం శ్రేణులు నిరసన తెలిపాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో నిరుద్యోగ ధర్నా చేపడుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు పక్కనే ఉన్న జడ్పీ కార్యాలయానికి ఎమ్మెల్సీ రావడాన్ని గమనించి ఒక్కసారిగా అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు.

**NOTICE**

All the members of The Satish Mutually Aided Co-Operative Housing Society Ltd., Regd. No. Amc/Dco/RR/98/11, Satish Nagar, Bowrampet, Dundigal-Gandimaisamma Mandal,